
ఎథెల్



# ఏజెంట్ X

యెదుళ్ల సురేష్ రెడ్డి

"తప్పదు డేవిడ్... నువ్వీ పని చేసి తీరాలి. కమ్యూనిస్టుల సానుభూతి పరులమైన మనం రష్యా కోసం ఈ పని చేయడంలో తప్పు లేదు" నచ్చ చెప్పుతున్నట్టుగా అన్నాడు రోసెన్‌బర్గ్.

ఆ గదిలో మొత్తం నలుగురు వ్యక్తులు కూర్చుని ఉన్నారు. అందులో మొదటి వ్యక్తి అమెరికాలోని ఎమర్సన్ రేడియో కంపెనీలో పని చేస్తున్న రోసెన్ బర్గ్. రెండవ వ్యక్తి అతని భార్య ఎథెల్, మూడవ వ్యక్తి ఎథెల్ సోదరుడు డేవిడ్ గ్రీన్‌గ్లాస్, నాలుగవ వ్యక్తి డేవిడ్ భార్య రుత్.

రష్యా గూఢచారులయిన రోసెన్‌బర్గ్, ఎథెల్‌లకు అంతకు కొన్ని రోజుల క్రితమే డేవిడ్ గ్రీన్‌గ్లాస్, లాస్ ఆల్‌మోస్‌లోని అణ్వాయుధ కర్మాగారంలో పని చేస్తున్నాడన్న విషయం తెలిసింది. అమెరికా, బ్రిటన్, కెనడాల ఆధ్వర్యంలో తయారు అవుతున్న అణుబాంబు రహస్యాల్ని సేకరించి రష్యాకు చేరవేయడం కోసం ప్రయత్నిస్తున్న వారికి ఈ వార్త అమితానందాన్ని కలిగించింది. స్వయంగా ఎథెల్‌కు సోదరుడయిన డేవిడ్ తమకు తప్పకుండా సహాయం చేస్తాడని భావించిన వాళ్లు, వెంటనే వెళ్లి అతన్ని కలుసుకుని తమ పథకాన్ని వివరించారు.

"కానీ ఇది చాలా ప్రమాదకరమైన పని. ఈ విషయం ఏ మాత్రం బయటపడినా డేవిడ్‌కు జైలు శిక్ష పడుతుంది" సంశయంగా అంది రుత్.

"అలా జరగదు" భరోసాగా అంది ఎథెల్. "ఇప్పటికి రెండు సంవత్సరాలుగా ఈ గూఢచర్యం జరుగుతోంది. ఇప్పటివరకూ అమెరికా, బ్రిటన్, కెనడాలలోని ఏ ఒక్కరికీ దీని గురించి అనుమానం రాలేదు. ఇక ముందు కూడా వచ్చే అవకాశం లేదు. మనతోపాటు అణుకార్మాగారంలో పని చేసే సైంటిస్టులు, గూఢచారులు కూడా ఇందులో పాలు పంచుకుంటున్నారు. కాబట్టి మనం భయపడాల్సిన అవసరం లేదు."

"కానీ నేను మీరూహిస్తున్నంత కీలకమైన రహస్యాల్ని సేకరించలేను. లాస్ ఆల్‌మోస్‌లోని అణుకర్మాగారంలో నేను మామూలు ఉద్యోగిని మాత్రమే. నాకు అందుబాటులో ఉండే రహస్యాలు చాలా తక్కువ" అన్నాడు అప్పటి వరకూ నిశ్శబ్దంగా ఉన్న డేవిడ్.

"నీకు అందుబాటులో ఉండే రహస్యాలు ఎంత చిన్నవైనా అవి మాకు అవసరమే... చాలా పెద్ద స్పై నెట్ వర్క్ ఇందుకోసం పని చేస్తోంది. ఎవరికి అందుబాటులో ఉన్న రహస్యాలు వాళ్లు సేకరిస్తేనేగానీ ఈ పని త్వరగా పూర్తికాదు. అందుకు నీ సహాయం మాకెంతో అవసరం. మా కోసం నువ్వీ సహాయం చేయాలి" బ్రతిమాలుతున్నట్టుగా అంది ఎథెల్.

చాలాసేపు తర్జనభర్జనలు జరిగిన తరువాత వారి పథకానికి అంగీకరించాడు డేవిడ్.

* * *

రెండవ ప్రపంచ యుద్ధంలో శత్రు దేశాలైన అమెరికా, రష్యా సైతం కలిసి పని చేశాయి. వాటికి బ్రిటన్, కెనడా తోడయ్యాయి. జర్మనీ లొంగిపోయింది. హిరోషిమా, నాగసాకిలపైన అణు బాంబు వేయడంలో అమెరికా రెండవ ప్రపంచ యుద్ధానికి స్వస్తి పలికింది.

అయితే రష్యా వద్ద అప్పటికి ఈ అణుబాంబు టెక్నాలజీ లేదు. తమ శత్రుదేశమైన అమెరికా అణుబాంబుల్ని తయారు చేయడంతో రష్యా కూడా ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని సాధించడానికి తొందరపడింది. అయితే అందు కోసం రష్యా శాస్త్ర పరిశోధనల్ని ఆశ్రయించకుండా, గూఢచర్యం ద్వారా అణుబాంబు సాంకేతిక పరిజ్ఞానాన్ని సంపాదించడానికి పూనుకుంది. అప్పటికి అమెరికా, కెనడా, బ్రిటన్ కలిసి కట్టుగా అణుబాంబుల్ని తయారు చేస్తున్నాయి. కెనడాలోని లాస్ ఆల్‌మోస్ లోని అణుకర్మాగారంలో ఈ మూడు దేశాల ఆధ్వర్యంలో చాలా పెద్ద ఎత్తున పరిశోధనలు కొనసాగుతున్నాయి. అక్కడి నుండి అణుబాంబు టెక్నాలజీని సంపాదించడానికి రష్యా స్పై నెట్ వర్క్‌ను ఏర్పాటు చేసింది.

రష్యా సీక్రెట్ సర్వీస్ అధినేత లావ్‌రెంటి బెరియా స్వయంగా ఇందు కోసం రంగంలోకి దిగాడు. అతని ఆదేశాల మేరకు న్యూయార్క్‌లో పని చేస్తున్న రష్యా సీక్రెట్ సర్వీస్ అధికారి అనటోలీ యాకోలోవ్ ఈ స్పై నెట్ వర్క్‌కి సారథ్యం వహించాడు. కాకలు తీరిన గూఢచారి హారీ గోల్డ్, బ్రిటన్ అణుశాస్త్రజ్ఞుడు క్లాస్ ఫుచెస్, రోసెన్‌బర్గ్, అతని భార్య ఎథెల్, లాస్ ఆల్‌మోస్‌లోని అణుకర్మాగారంలో పని చేస్తున్న ఎథెల్ సోదరుడు డేవిడ్ గ్రీన్ గ్లాస్, వాషింగ్టన్‌లోని రష్యా గూఢచారి ఎలిజబెత్ బెంట్లే, కెనడాలోని ఎక్స్‌టర్నల్ ఎఫైర్స్ డిపార్ట్ మెంట్‌లోని ఉద్యోగి ఎమ్మావోల్కిన్, బ్రిటన్ హైకమీషన్‌లోని కెవిల్‌షర్, బ్రిటన్ అణుశాస్త్రజ్ఞుడు డాక్టర్ అన్‌నన్ మే, ఒట్టావాలోని రష్యా గూఢచారి కల్నల్ జబోటిని, లండన్‌లోని రష్యా రాయబార కార్యాలయంలో పని చేస్తున్న సైమన్ క్రీమర్, ఎలక్ట్రికల్ ఇంజనీర్, రాడార్ స్పెషలిస్టు అయిన మోర్టన్ సోబెల్‌లతో పాటు మరెంతో మంది ఈ స్పై నెట్ వర్క్‌లో రష్యా తరపున పని చేశారు.

అమెరికా, కెనడా, బ్రిటన్‌లకు ఏ మాత్రం అనుమానం రాకుండా జరిగిన ఇంత పెద్ద గూఢచర్యంలో ఎంతో కాలంపాటు పరిశోధనలు చేసి, కొన్ని వందల కోట్లు ఖర్చుపెట్టి అమెరికా కనుక్కున్న అణుబాంబు టెక్నాలజీని రష్యా చాలా సులభంగా చేజిక్కించుకుంది. ప్రపంచాన్నే నివ్వెరపరిచిన ఈ గూఢచర్యంలో చివరికి విజయం రష్యానే వరించింది.

* * *

ఐగర్ గుజెంకో...

కెనడాలోని ఒట్టావాలో కోడ్ లాంగ్వేజీ నిపుణుడుగా పని చేస్తున్న ఈ రష్యా అధికారి ఆ రోజు దీర్ఘాలోచనలో మునిగి ఉన్నాడు. అప్పటికే అతను రష్యాను కాదని కెనడాలో రాజకీయ ఆశ్రయం పొందడానికి నిశ్చయించుకున్నాడు. కెనడాలోని స్వేచ్ఛాజీవితానికి అలవాటు పడిన అతనికి తిరిగి రష్యా వెళ్లి అక్కడి కమ్యూనిస్టు కట్టుబాట్ల మధ్య బ్రతకడం ఇష్టం లేకపోయింది. అతని భార్య పిల్లలు కూడా కెనడాలోనే స్థిరపడాల్సిందిగా కోరడంతో అతనికి మరో మార్గం లేకపోయింది. ఒట్టి చేతులతో వెళ్లితే కెనడా ఆశ్రయాన్ని సంపాదించడం కష్టమని భావించిన అతను, తనకు అందుబాటులో ఉన్న రహస్య పత్రాలన్నింటినీ సేకరించి తీసుకు వెళ్లి కెనడా ప్రధానికి అందజేశాడు.

ఆ పత్రాల్ని చూడగానే కెనడా ప్రధానమంత్రి విస్మయంతో కదిలిపోయాడు. కెనడాలో రష్యా నిర్వహిస్తున్న గూఢచార కార్యకలాపాలకు సంబంధించిన వివరాలతో పాటు, లాస్ ఆల్ మోస్‌లోని అణుబాంబు రహస్యాల్ని సేకరించడానికి ప్రయత్నిస్తున్న రష్యా స్పై నెట్‌వర్క్‌కు చెందిన వివరాలు కూడా ఆ పత్రాల్లో ఉన్నాయి. ఆ మరుక్షణమే ఐగర్ గుజెంకోకు రాజకీయ ఆశ్రయం లభించింది. ఆ వెంటనే కెనడా ప్రధానమంత్రి అమెరికా ప్రెసిడెంటునీ, బ్రిటన్ ప్రధాన మంత్రినీ కలుసుకుని అణుబాంబు టెక్నాలజీని తస్కరించ డానికి పని చేస్తున్న రష్యా స్పై నెట్ వర్క్‌ను గురించి తెలియచేశాడు.

తమకు ఏ మాత్రం అనుమానం రాని విధంగా జరగుతున్న ఇంత పెద్ద గూఢచర్యం గురించిన వివరాలు బయట పడగానే వాళ్లు ఆందోళనకు గురయ్యారు. ఆయా దేశాల గూఢచార విభాగాలు ఆఘమేఘాల మీద రంగంలోకి దిగాయి. రష్యా స్పై నెట్ వర్క్‌లోని ఏజంట్లందర్నీ యుద్ధ ప్రాతిపదిక మీద అరెస్టు చేశారు. ఆ విషయాన్ని పసిగట్టి దేశం నుండి పారిపోవడానికి ప్రయత్నించిన రోసెన్ బర్గ్, ఎథెల్‌ల ప్రయత్నాలు ఫలించలేదు. చివరికి వాళ్లు కూడా అమెరికా పోలీసుల చేతికి చిక్కారు.

ప్రపంచాన్ని కుదిపివేసిన ఈ గూఢచర్యంలో పాలుపంచుకున్న వారందరికీ పెద్ద ఎత్తున శిక్షలు పడ్డాయి. ఈ స్పై నెట్ వర్క్‌లో కీలక పాత్ర వహించిన ఎథెల్, రోసెన్ బర్గ్‌లకు అమెరికా ప్రభుత్వం మరణశిక్ష విధించింది.

అయితే చివరి వరకూ కూడా వీరిద్దరూ తాము రష్యా గూఢచారులం అని అంగీకరించడానికి నిరాకరించారు. అమెరికా ప్రభుత్వం వీరి నుండి ఎలాంటి రహస్యాల్నీ రాబట్టలేకపోయింది. తమకు క్షమాభిక్ష ప్రసాదించాల్సిందిగా పదే పదే వారు చేసుకున్న అభ్యర్థనల్ని అమెరికా సుప్రీం కోర్టు, అమెరికా ప్రెసిడెంట్ హారీ ట్రూమన్‌లు తిరస్కరించారు. ట్రూమన్ స్థానంలో కొత్తగా ఎన్నికయిన ప్రెసిడెంటు ఐసెన్ హోవర్ వారికి తెలిసిన రహస్యాలన్నీ బయటపెడితే వారి మరణ శిక్షను జీవిత ఖైదుగా మారుస్తానని హామీ ఇచ్చాడు. సింగ్ సింగ్ జైలులోని రోసెన్ బర్గ్, ఎథెల్‌ల గదిలో నుండి ఐసెన్ హోవర్ కార్యాలయానికి డైరెక్టు ఫోను ఏర్పాటు చేశారు. ఆ ఫోను ద్వారా వారు ఎప్పుడంటే అప్పుడు తనతో మాట్లాడవలసిందిగా ఐసెన్ హోవర్ వారికి తెలియచేశాడు. అయినా రోసెన్ బర్గ్, ఎథెల్ చివరి వరకూ కూడా ఎలాంటి రహస్యాల్ని బయట పెట్టలేదు.

జూన్ 19, 1953...

అతి కీలకమైన అణుబాంబు రహస్యాల్ని రష్యాకు చేరవేయడంలో ముఖ్య పాత్ర వహించినందుకు అమెరికా ప్రభుత్వం ఎథెల్, రోసెన్ బర్గ్‌లకు సింగ్ సింగ్ జైలులోని ఎలక్ట్రిక్ చైర్‌లో మరణ శిక్ష అమలు జరిపింది. ఆ రోజే వారి పద్నాలుగవ పెళ్లి రోజు కావడం కాకతాళీయం. ●

